క్లుప్తంగా

26నుంచి శివాలయం జాతర

నారాయణపేట రూరల్ : మండలంలోని భైరంకొండ గ్రామ అమ్మవారి తోట శివాలయంలో ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు జాతరను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సమావేశమై పలు అంశాలను చర్చించుకున్నారు. 26న ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మంగళహారతి, 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు, సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న అభిషేకం, మహా నైవేద్యం, 10 గంటల నుంచి రిటపట్ల, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

బీజేపీలోకి మాజీ ఉపసర్పంచ్

మరికల్: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ సీమ శివకుమార్ ఆదివారం బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎంపీ డీకే అరుణ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భజరంగ్‌దళ్ అధ్యక్షులు రవి, రఘులు సైతం బీజేపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని బలోపేతం చేసి అధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఎంపీ దీమా వ్యక్తం చేశారు.

చేతి పంపు ప్రారంభం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలోని కట్టమీద ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆదివారం చేతిపంపును గ్రామస్తులు ప్రారంభించారు. ఎల్లమ్మ ఉత్సవాల సమయంలో ఇక్కడ నీటి ఎద్దడి సమస్య ఉండటంతో గ్రామస్తులంతా కలిసి బోరు వేయించారు. ఆలయం దగ్గర నీటి సమస్య తీరడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడికి సన్మానం



ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లికి చెందిన శివరాజ్ ఇటీవల బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆదివారం ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల 1991–92 విద్యాసంవత్సరానికి చెందిన ఎస్ఎస్‌సీ మిత్రులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో చదివిన మిత్రుడు బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని వారు ఆకాంక్షించారు.

శివనామ స్మరణతో అగ్నిగుండ ప్రవేశం



ఊట్కూరు: స్థానిక వీరభద్రేశ్వర దేవాలయం వద్ద ఏర్పాటు శివస్వాముల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున శివనామస్మరణతో అగ్నిగుండ కార్యక్రమం నిర్వహించారు. శివస్వాములు తెల్లవారుజామున గ్రామ పురవీధుల్లో శివనామస్మరణ చేస్తూ నందిబోన కార్యక్రమం చేపట్టారు. అగ్నిగుండంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ నడుచుకుంటూ వెళ్లడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈవేడుకలు తిలకించేందుకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. భక్తులు ప్రభులింగం, నాగభూషనం, రాజు, అంజనేయులు, సురేష్‌లింగం పాల్గొన్నారు.

మౌంటెన్ సైకిలింగ్ పోటీలు ప్రారంభం

మక్తల్: పట్టణంలో మౌంటెన్ సైక్లిలింగ్ పోటీలను డీవైఎస్ఓ వెంకటేస్‌శెట్టి ఆదివారం ప్రారంభించారు. మక్తల్ నుంచి వడ్వాట్ రోడ్డు దాదాపు 10 కిలోమీటర్ల వరకు ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు రమేష్ కుమార్, శ్యాం, రాకేష్, స్వరూప, సౌమ్య, గాయత్రిలతో పాటు దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్వత్ సదస్సు

నారాయణపేట టౌన్: పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యాపీఠంలో రేపు(మంగళవారం) విద్వత్ సదస్సును నిర్వహిసున్నట్లు విద్వత్ పరిషత్ కన్వీనర్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 'హిందుత్వ నిష్ఠ, రాష్ట్ర భక్తి, జాతీయత' అనే అంశాలపై ముఖ్యవక్త లింగం సుధాకర్ రెడ్డి హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పలువురు విద్యావేత్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం.. బాలామృతం



మాగనూర్ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు బాలామృతం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు(ఫైల్)

- 7నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు అందజేత
- అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మాగనూర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది. పోషక విలువలతో కూడిన బాలామృతం అందించి చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ప్రత్యేక దృష్టి సారించాయి. అంగన్‌వాడీ టీచర్లు సైతం నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. 7నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం ప్లస్, బాలామృతం ప్యాకెట్లు అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తోంది. మక్తల్ ప్రాజెక్టు పరిధిలోని మాగనూర్ మండలంలో 33 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 1017, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు వారు 732మంది ఉన్నారు. 224మంది గర్భిణులు, 222 మంది బాలింతలు ఉన్నారు. మండలంలో బలహీనంగా ఉన్న 60మంది చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందించేంకు ప్రభుత్వం బాలామృతం ప్లస్‌ను అందిస్తుంది.

ఎత్తు, బరువు ఆధారంగా నమోదు..

బాలామృతం ప్లస్‌లో పాలపొడి, వేరుశనగ నూనె, రైస్, గోధుమలు, కందిపప్పు, పంచదారతో పాటు కొవ్వు పదార్థాలు కలిగిన మిశ్రమం జతచేస్తారు. ఎదుగుదల లోపించిన చిన్నారులకు ఈ ఆహారం అందించి మూడు నెలల పాటు చిన్నారుల ఎదుగుదల, పోషకలోపాల తీరును పరిశీలిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా బరువు, ఎత్తు ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని రికార్డుల్లో నమోదు చేస్తారు.

చిన్నారులకు ఆరోగ్య కార్డులు..

చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితి తెలుకునేందుకు ఆరోగ్యకార్డులను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్నారు. ప్రతి చిన్నారికి ప్రత్యేకమైన ఆరోగ్య పర్యవేక్షణ కార్డులు అందించి, వారి ఎత్తు, బరువు కొలతలు తీసుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగహన కల్పిస్తున్నారు.

రోజు అందిస్తున్నారు..



మాపాప ఎదుగుదల లోపించిందని అంగన్‌వాడీ టీచర్ ఎత్తు, బరువును పరిశీలించారు. పౌష్టికాహార లోపంతో ఎదుగుదల లేదని భావించి పాపకు ప్రతిరోజు బాలామృతం ప్లస్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం పాప ఎత్తు, బరువు చూసి ఎదుగుదల ఉందని చెప్పారు.

– సుజాత, చిన్నారి తల్లి, మాగనూర్

ప్రతినెలా బరువు, ఎత్తు కొలతలు తీసుకుంటాం



చిన్నారుల ఎదుగదలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం అందిస్తున్నాం. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వయస్సు ఉన్నవారికి వీటిని ఇస్తాం. చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించి ప్రతినెలా బరువును, ఎత్తు కొలతలు తీసుకుంటాం.

– తులసి, అంగన్‌వాడీ టీచర్, మాగనూర్

చిన్నారుల ఎదుగుదలకే..

పోషకాహార లోపంతో ఉన్నవారికి బలవర్ధకమైన ఆహారంగా బాలామృతం ప్లస్‌ను ప్రభుత్వం అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల తల్లులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలి.

– అమ్మక్క, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మాగనూర్.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- 'ఇందిరమ్మ' నమూనా భవన నిర్మాణానికి భూమిపూజ



మక్తల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివరం పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నమూనా కోసం ఇంటి నిర్మాణాన్ని ఇక్కడ చేపడుతున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు చంద్రకాంత్‌గౌడ్, గణేష్, కట్ట సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని వినతి

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల నుంచి వెళ్లే రోడ్డును మరమ్మతులు చేపట్టాలంటూ ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆగ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఊట్కూరు వెళ్లే రహదారిలో సుమారు 200 మంది రైతుల పొలాలు ఉంటాయని, ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. విఘ్నేశ్వర్‌రెడ్డి, శంకర్, రాజేష్, కోళ్ళ కృష్ణయ్య, అంజప్ప ఉన్నారు.

పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం

మాగనూర్: స్థానిక నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో రూ.86 లక్షలతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనంను ఆదివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి శాశ్వత భవనం నిర్మించినట్లు తెలిపారు. మండలంలో ఒక గోదాం నిర్మించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా అందుకు ఆమె స్పందించి త్వరలోనే మంజూరు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మాగనూర్ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో మట్టి మాయం

- రాత్రికి రాత్రే తరలించిన మట్టి మాఫియా
- గుంతలను చూసి ఆశ్చర్యపోయిన రైతు
- పోలీసులకు ఫిర్యాదు



పొలంలో మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతను చూపిస్తున్న రైతు

మరికల్: రైతుల పొలాల్లో మట్టి రాత్రికి రాత్రే మాయం అవుతుంది. మట్టి మాఫియా రెచ్చిపోయి రాత్రి వేళ రైతుల పొలాల్లో మట్టిని అక్రమంగా టిప్పర్ల ద్వారా తరలిస్తోంది. వీటిని ఇటుక బట్టీలకు అమ్మి ధనార్జన చేస్తోంది. మండలంలోని జిన్నారం శివారులో ఆనంద్‌కుమార్ అనే రైతు పొలంలో శనివారం రాత్రి జేసీబీలతో గుంతలు పెట్టి దుబ్బతో కూడిన మట్టిని తీసి ఇటుక బట్టీలకు తరలించారు. ఆదివారం ఉదయం పొలానికి వచ్చిన రైతు పొలంలో పడ్డ గుంతను చూసి అవాక్కయ్యాడు. మట్టి తరలింపు విషయాన్ని చుట్టుపక్కల రైతుల దగ్గర ఆరాతీశాడు. తమకు తెలియదని వారు చెప్పారు. అనుమానం వచ్చి ఇటుక బట్టీల దగ్గర చూడగా మట్టి కుప్పలు కనిపించాయి. దీంతో బాధిత రైతు మట్టి మాయం అయిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యాదగిరి ఆశయ సాధనకు కృషిచేద్దాం

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



ఊట్కూర్: కామ్రేడ్ కర్నాటి యాదగిరి ఆశయ సాధనకు కృషి చేద్దామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. మండలంలోని బిజ్వార్‌లో శనివారం రాత్రి సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ కార్నటి యాదగిరి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవోద్యమ నిర్మాణాలకు పునాదులు వేసిన మూలస్తంభం లాంటి వాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సలీం, వెంకట్‌రెడ్డి, కిరణ్, గోవర్దన్‌రెడ్డి, ఈశ్వర్, మల్లేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధన్వాడలో కరపత్రాలను విడుదల చేస్తున్న చేనేత కార్మికులు

ధన్వాడ: చేనేత కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని సహకార భారతి చేనేత విభాగం మాజీ కోకన్వీనర్ కెంచె శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార భారతి ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న నారాయణపేటలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న చేనేత కార్మికుల సమావేశం విజయవంతం చేయాలంటూ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవించే అందరికీ రూ.2లక్షల రుణమాఫీ, చేనేత కార్మికుడికి నెలకు రూ.5వేలు జీవన భృతిని ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయభాను, పద్మశాలి సంఘం కార్యదర్శి సురేందర్, బాలయ్య, రఘురాములు, జయప్రకాష్, నర్సిములు, వెంకటేష్, కృష్ణయ్య, నారాయణ, దోమకృష్ణయ్య, రాజు, కుర్మన్న, గురునాథ్ పాల్గొన్నారు.

'స్థానికం'లో ముదిరాజుల ఐక్యత చాటాలి



దామరగిద్ద: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో ముదిరాజులు ఐక్యంగా ఉండి అత్యధిక స్థానాలను గెలిచి ఐక్యతను చాటుకోవాలని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు మొగులప్ప, మాజీ ఎంపీటీసీ అంజిలప్ప అన్నారు. ఆదివారం మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో మండల ముదిరాజ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఉన్న 16ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక స్థానాలు గెలిచి ముదిరాజ్ సామాజికవర్గం నుంచి ఎంపీపీ పదవిని దక్కించుకోవాలన్నారు. జెడ్పీటీసీ బీసీలకు వస్తే ముదిరాజ్‌లు కైవసం చేసుకునేలా రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో నీలి వెంకట్రాములు శ్రీనివాస్, వెంకట్రాములు, మహిపాల్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్

మాగనూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం అని ఇన్‌చార్జ్ ఎంఈఓ అనిల్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు వసతిగృహ సిబ్బంది మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గది పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ అఫ్జల్‌అహ్మద్ పాల్గొన్నారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఊట్కూర్ పాఠశాల ఆవరణలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఊట్కూర్ : మండలంలోని చిన్న పొర్ల గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ 2000–21 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 24 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులు భాస్కర్‌రెడ్డి, రాజేందర్, నర్సింహులు, విజయలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారి ఆశీర్వాదం పొందారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య ఉందని తెలుసుకొని వారంతా కలిసి 1000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను పాఠశాలకు విరాళం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రమోహన్, ఆనంద్, నర్సింహులు, రాజ్‌కుమార్.రాజేశ్వరి, కిరణ్, నాగవేణి,రవి, అశోక్, నర్సిములు, షకీల్, ఆనంద్, శివకుమార్, ఏ.జ్యోతి, పి.జ్యోతి, వహిదాబేగం, షాహీనాబేగం, జయమ్మ, మమత తదిరులలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వర ఆలయంలో..

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో 1984–85, 1986–87 విద్యాసంవత్సరానికి పది, ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కన్యకా పరమేశ్వర ఆలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు నెమరేసుకున్నారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, పూర్వవిద్యార్థులు రాజశేఖర్, కట్టసురేష్, శ్రీనివాసులు, అనుగొండ జగదీష్, డాక్టర్ శ్రీరామ్, మహేశ్వరం, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, నారాయణగౌడ్, నజీర్, ప్రాణేష్‌చారీ, శంకర్‌లింగం, తిరుపతి, హరిదాస్, బాబు, జ్యోతి, సుగుణ, నరేందర్, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం విగ్రహ శోభయాత్ర అనంతరం దాన్యదివాసం మహాయజ్ఞం పూజలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంభాభిషేకం పూజలు చేపట్టనున్నారు, ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా స్వామి ఆదిత్యపరాశ్రీ, శాందనంద్‌పు రోహిత్‌లు హాజరౌతున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్పస్వామి పల్లకీ సేవ



ఊరేగింపుగా బీరప్ప స్వామి పల్లకీసేవ

మరికల్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బీరప్ప స్వామి బండారు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా స్వామివారి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులో ఉన్న మంచినీటి బావి దగర బీరప్ప స్వామి విగ్రహాలను, ఆభరణాలను నీళ్లతో శుభ్రం చేయించి అక్కడే ఉపవ్యాస దీక్షలు విడిచారు. అనంతరం పల్లకీసేవ ద్వారా ఊరేగింపుగా బీరప్ప ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ ఆలయంలో పూజలు చేశారు. సోమవారం బీరప్ప స్వామి బండారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సరస్వతీదేవి విగ్రహాలకు పూజలు..

మండల కేంద్రంలో జరుగుతున్న సరస్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా రెండో రోజు ఆదివారం నీటిలో ఉంచిన విగ్రహాలకు ఎంపీ డీకే అరుణ పూజలు చేశారు. అనంతరం భక్తులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సన్‌గౌడ్, వేణు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, రమేష్, శ్రీరామ్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'దత్తత తీసుకొని దగా చేశావు'



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్

కోస్గి రూరల్: వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని కేటీఆర్ దగా చేశావని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేటీఆర్ కొడంగల్‌ను పదేళ్ల దత్తత తీసుకొని అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి రూ.5000కోట్ల నిధులను కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే కేటీఆర్ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ఇండస్ట్రీయల్ కారిడార్ తీసుకొచ్చి కొడంగల్‌లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తుడుం శ్రీనివాస్, ఇద్రిస్, గిరిధర్‌రెడ్డి, భానునాయక్, నాగులపల్లి నర్సింహ, మహిపాల్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేష్, తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

- ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి



పదవీ విరమణ పొందిన టీచర్లను సన్మానిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఆ సంఘం 54వ ఆవిర్భావ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధిలో పీఆర్టీయూ పాత్ర ఎంతో ఉందని, టీచర్లు, పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేజీబీవీ, మాడల్ స్కూల్ టీచర్ల ఇబ్బందులు, సీపీఎస్ రద్దు, 317బదిత టీచర్ల సమస్యల సాధనకు కృషిచేస్తామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ బలపర్చిన అభ్యర్థులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత సంఘం నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన పలువురు రిటైర్డ్ టీచర్లను శాలువాతో సన్మానించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు రఘువీర్, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథ్, రమేష్, శేఖర్, భాస్కర్, అనిల్, నవీన్, కిష్టయ్య, ముస్తప్ప, శ్రీకాంత్, జనార్దన్, డీఎస్ఓ భానుప్రకాష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఆధారంగా టికెట్లు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరహరి

ధన్వాడ: స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని ఆపార్టీ మండలాధ్యక్షుడు నరహరి అన్నారు. ఆదివార మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలో ఎవరు టికెట్ ఆశిస్తున్నారు అన్న విషయంపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మయ్య, సరాఫ్ నాగరాజ్ పాల్గొన్నారు.

యువజన సంఘం అధ్యక్షుడు గైర్హాజరు..

కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి యువజన సంఘం అధ్యక్షుడు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో సముచిత స్థానం ఇవ్వడం లేదని, యువజన సంఘంను పట్టించుకోవడంలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి ఈ విషయంపై యువజన సంఘం అధ్యక్షుడు రాజును సంప్రదించగా పార్టీ తమను పట్టించుకోవడం లేదని, కనీసం సమాచారం అందించకుండా సమావేశాలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.